

గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..








సంపుటి - 3 సంచిక -84 ఆదివారం 30 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




## తుమ్మిడిహట్టి నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం

**ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి:మంత్రి ఉత్తమ్**

**భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్**

**సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు**

**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.
తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు

మిగతా 2లో.

## సర్ గడువు 4 వారాలు పొడిగించాలి

**ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ**

**92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి**

**అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం**

**ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం**



**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల కమిషనర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు,

మిగతా 2లో.

## మల్లికార్జున్ ఖర్గేకు న్యాయంచేయాలి

**: రాహుల్ గాంధీ డిమాండ్**



**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు న్యాయం చేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ హల్ద్వానీలో చేపట్టిన 'శుద్ధి' కార్యక్రమం'పై ఎస్‌సి/ఎస్‌టి చట్టం కింద కేసు నమోదు చేయాలని అన్నారు. న్యూఢిల్లీలో శనివారం

మిగతా 2లో.

## ముఖ్యమంత్రిని పనిచేసుకోనివ్వాలి

**కేబినేట్ పునర్వ్యవస్థీకరణతో కొత్తదనం తేవాలి**

**మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని అన్నారు. ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు.

మిగతా 2లో.



## విశాఖలో తీవ్ర విషాదం..

**ఒకే కుటుంబంలో నలుగురి ఆత్మహత్య**

భార్య, ఇద్దరు కుమార్తెలకు విషమిచ్చి భర్త బలవన్మరణం
రాఖీ పండుగ జరుపుకున్న కొన్ని గంటల్లోనే విషాద ఘటన



2లో.

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు



**మన ఆరోగ్యం ..మన ఫోన్‌లోనే ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే**


**గిరిజన ప్రాంతాల్లో సెల్ టవర్ ద్వారా కనెక్టివిటీ పెంచుతాం**

**గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే అందేలా చేస్తాం**

**అరకు పర్యటనలో సిఎం చంద్రబాబు**

**పాడేరు,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు

మిగతా 2లో.



## ఎంఐఎం నుంచి ఎమ్మెల్సీ బహిష్కరణ..

**ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన మజ్లిస్**

**సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నవి డీప్‌ఫేక్ వీడియోలని ఆరోపణ**

**తనను, పార్టీని అప్రతిష్టపాలు చేసే కుట్ర అని రహ్మత్ బేగ్ వ్యాఖ్య**

**వీడియోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ముందే ఫిర్యాదు చేశానని వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి బహిష్కరించడం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

మిగతా 2లో.

## 2022లో సజ్జల నాపై దాడి చేశాడు

**వైసీపీలో తనకు ఎదురైన అవమానాలపై విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ**

**సజ్జల రామకృష్ణారెడ్డి ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్ అని సంచలన ఆరోపణలు**

**పార్టీ ప్లీనరీలో తనపై సజ్జల భౌతికంగా దాడి చేసినా జగన్ మౌనంగా ఉన్నారన్న విజయసాయి**

**వైసీపీలో ఇప్పుడు జగన్ నంబర్ 2, సజ్జల నంబర్ 1 అని తీవ్ర విమర్శలు**

**ఆత్మగౌరవం చంపుకోలేకనే రాజ్యసభ పదవికి, పార్టీకి రాజీనామా చేశానని వెల్లడి**



**అమరావతి,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా పెను దుమారం రేపారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల

మిగతా 2లో.

## భవిష్యత్ పోరాటాలపై బిజెపి కసరత్తు

**22ఎ భూములపై త్వరలోనే కార్యాచరణ**

**పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రామ్ సమీక్ష**



2లో.

## 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**సభ్యులకు కార్యదర్శుల లేఖలు**

**హైదరాబాద్ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు సెప్టెంబరు 7 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు కార్యదర్శులు శాసనస భ్యులు, శాసనమండలి సభ్యులకు ప్రత్యేకంగా లేఖలు రాశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సభ్యులకు సమాచారం పంపారు. వర్షాకాల సీజన్ ఎన్ని రోజులు సమావేశాలు జరపాలనే విషయమై బీఏసీ సమావేశంలో నిర్ణయిస్తారు. ఎనిమిదో విడతకు సంబంధించి రెండో సమావేశాలు కావడం గమనార్హం

మిగతా 2లో.



# 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి**

. ఈ సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి చేరుకోవడంతో సమావేశాలను కనీసం వారం రోజులపాటు నిర్వహించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. జెన్ జీలను అసెంబ్లీ, పార్లమెంటుకు పోటీచేసేలా అర్హతలను సవరించే బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపాదించే అవకాశాలు లేకపోలేదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.అసెంబ్లీ సమావేశాల కంటే ముందు మరోసారి మంత్రివర్గ సమావేశం జరగనుంది. సర్కారుపై ప్రతిపక్షాలు విరివిగా విమర్శలకు దిగుతున్న నేపథ్యంలో సమావేశాల ద్వారా గుణపాఠం చెప్పేందుకు అధికారపక్షం ఈ సమావేశాలను ఉపయోగించుకునే అవకాశం కనిపిస్తున్నది. ఇదిలావుండగా బీఆర్ఎస్ సైతం ఈ సమావేశాల్లో సర్కారును ఇరుకున పెట్టాలని భావిస్తున్నది. సమావేశాలు ప్రారంభం రోజున జరిగే బీఏసీలో ఎన్ని రోజులు అసెంబ్లీ, మండలి జరగనున్నాయనే విషయమై స్పష్టత రానుంది. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి, మండలి కార్యదర్శి డాక్టర్ నరసంహచారి సన్నాహాలు ప్రారంభించారు. గత కొన్ని నెలలుగా అసెంబ్లీ భవనానికి మరమ్మతులు జరుగుతున్న సంగతి తెలిసిందే. తొలిసారిగా పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో తరహాల అసెంబ్లీలో కూడా ఏర్పాట్లు జరుగుతున్నది. మరమ్మతులు వేగంగా పూర్తిచేసే పనిలో అధికారయంత్రాంగం ఉంది.

# గడువు 4 వారాలు పొడిగించాలి

**మొదటిపేజీ తరువాయి**

రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు.

దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# విశాఖలో తీవ్ర విషాదం..

**విశాఖపట్నంఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**

విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం చింతలగ్రహారం కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మల్లా వినోద్‌కుమార్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

వివరాల్లోకి వెళితే.. స్థానికుల నుంచి అందిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో వినోద్‌కుమార్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించగా, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు విగతజీవులుగా పడి ఉన్నారు. వినోద్‌కుమార్ ముందుగా తన భార్య, పిల్లలకు విషం ఇచ్చి, ఆ తర్వాత తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.రాఖీ పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన కొన్ని గంటల్లోనే ఈ దారుణ ఘటన జరగడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. కుటుంబం ఇంతటి తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# మల్లికార్జున్ ఖర్గేకు న్యాయంచేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ చర్యను 'నేరం'గా ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు న్యాయం చేయాలని, ఈ చర్యపై కేసు నమోదు చేయాల్సిందిగా ప్రధాని మోడీ అధికారులను ఆదేశించాలని పేర్కొన్నారు. ఖర్గేకు న్యాయం జరిగేలా చూడటం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాధ్యత అని అన్నారు. రాజ్యాంగంప్రకారం అంటరానితనం నిషేధమని, అది నేరంగా పరిగణించబడుతుందని అన్నారు. అయినా బిజెపి/ఆర్ఎస్ఎస్‌లు ఆ చర్యను పాటిస్తున్నాయని మండిపడ్డారు.

'ఆ ప్రదేశం నినాదాలతో కలుషితమైంది' అని ఉత్తరాఖండ్ బిజెపి అధ్యక్షుడు మహేంద్ర భట్ ఈ చర్యను సమర్థిస్తూ వ్యాఖ్యానించిన వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. రాజ్యసభ ప్రతిపక్షనేత పట్ల ఇటువంటి చర్యలకు పాల్పడితే.. ఇక పాఠశాలలో నాలుగేళ్ల చిన్నారి పట్ల ఎలా వ్యవహరిస్తారో అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ ఘటన బిజెపి-ఆర్ ఎస్ఎస్ మనస్తత్వాన్ని బయటపెడుతోందని, దళితులు గౌరవంగా,విజయంతో జీవించడం వారికి ఇష్టంలేదని దుయ్యబట్టారు. ఈ నెల8వ తేదీన హల్ద్వానిలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన విజయ శంఖనాద్ ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రసంగించారు. రెండు రోజుల తర్వాత, ఆ ప్రదేశం అపవిత్రమైందంటూ శ్రీరామ్ సేన సభ్యులు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే.

## తుమ్మిడిహట్టి నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం

80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఎంఐఎం నుంచి ఎమ్మెల్సీ బహిష్కరణ.

అయితే, ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ కుట్రకు పాల్పడ్డారని రహ్మత్ బేగ్ ఆరోపించారు.

పార్టీ బహిష్కరణకు ముందే తన కుటుంబంతో కలిసి మక్కా వెళ్లిన రహ్మత్ బేగ్, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులు ఫోన్ చేసి సోషల్ మీడియాలో కొన్ని అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నట్లు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపై కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీని, పార్టీ అధినేతలు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈ డీప్ ఫేక్ వీడియోలను సృష్టించారని ఆయన వివరించారు.

ఈ అంశంపై తాను ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంతో పాటు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని రహ్మత్ బేగ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 28వ తేదీ రాత్రి ఎంఐఎం అధిష్ఠానం ఆయనను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. శాసనమండలి సభ్యత్వానికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. తాజా పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఇతర రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# భవిష్యత్ పోరాటాలపై బిజెపి కసరత్తు

## 22ఏ భూములపై త్వరలోనే కార్యాచరణ

## పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రామ్ సమీక్ష

**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త)::** తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22-ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22-ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు

**మొదటిపేజీ తరువాయి**

. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 'జే బ్రాండ్లు' పేరుతో కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలతో చెలగాటమాడారని, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్ష పత్రాలను ఒక ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు.

ఇక తన పర్యటన ముఖ్య ఉద్దేశమైన 'సంజీవని' ప్రాజెక్టు వివరాలను సీఎం వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్యం అందించే ఈ ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో తదుపరి స్థాయి విప్లవమని




అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదలకు రూ.250 కోట్లతో 'ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో అన్ని మండలాల్లో జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డ్రోన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు మందులు, వ్యాక్సిన్లు పంపడంతో పాటు రక్త నమూనాలను ల్యాబ్‌లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు.

గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం ఐదు సూత్రాల ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు




నిర్మిస్తున్నామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించి, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించి గిరిజనులకు ఆదాయ మార్గాలు పెంచుతామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాల కోసం తీసుకొచ్చిన జీఓ నంబర్ 3ని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం తెస్తామని భరోసా ఇచ్చారు.

రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపైనా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2022లో సజ్జల నాపై దాడి చేశాడు

**మొదటిపేజీ తరువాయి**

రామకృష్ణారెడ్డిపై నిప్పులు చెరుగుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేశారు. తనపై "నమ్మకద్రోహి" అంటూ వైసీపీలోని ఓ వర్గం దుష్ప్రచారం చేయిస్తున్నందునే ఈ లేఖ రాయాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖలో ఆయన చేసిన ఆరోపణలు, వెల్లడించిన విషయాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

**సజ్జల ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్**

"నేనే గనక నమ్మకద్రోహిని అయితే, ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌గారికి నమ్మకస్తుడిననే ఒకే ఒక్క కారణంతో ప్రతి చార్జిషీట్‌లో నన్ను ఏ-2గా చేర్చారు. జగన్‌గారు 16 నెలలు జైల్లో ఉంటే, నేను 15 నెలలు జైల్లో ఉన్నాను. నమ్మకద్రోహం నా రక్తంలో ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని" అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు.

2024 ఎన్నికల తర్వాత కూడా తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఏ-5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2గా తనను చేర్చారని, కానీ ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" అయిన సజ్జల పేరు ఒక్క చార్జిషీట్‌లో కూడా లేకపోవడం గమనార్హమన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, టీడీపీతో కలిసి ఎలా పనిచేయాలో, కేసులు లేకుండా ఎలా చూసుకోవాలో ఆ "కోటరీ నాయకుడికి" తెలిసినంత తనకు తెలియదని ఎద్దేవా చేశారు.

**ప్లీనరీలో భౌతిక దాడి.. జగన్ ప్రేక్షకపాత్ర**

2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నేరుగా భౌతికంగా దాడి చేశారని, ఈ విషయం జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. పార్టీలో ఉన్న ఇతర నాయకులు కూడా ఈ ఘటనను చూశారని తెలిపారు. అప్పటికే సజ్జల చేతిలో జగన్ బందీ అయిపోయారని, అందుకే తనను పూర్తిగా పక్కనపెట్టేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో "సాయన్నకు వయసైపోయింది, ముసలోడైపోయాడు" అంటూ అనుబంధ సంఘాల బాధ్యతల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ తర్వాత ఉత్తరాంధ్ర, గుంటూరు నుంచి తిరుపతి వరకు ఉన్న జిల్లాల ఇంఛార్జ్ బాధ్యతల నుంచి, చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని వివరించారు. ఇలాంటివి మొత్తం 74 అవమానాలు జరిగాయని, ఎన్నో విషయాలు కడుపులోనే దాచుకున్నానని అన్నారు.

**సకల శాఖల మంత్రిగా సజ్జల.. జగన్‌కు గోడ కట్టారు**

"2019లో పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించింది. పరిపాలన జగన్‌గారు చేశారా లేక సజ్జల 'సకల శాఖల మంత్రి'గా, రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేశారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా జగన్‌ను కలవనీయకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ప్రశ్నించారు.

పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరినీ రీజినల్ కోఆర్డినేటర్లుగా పెట్టి, అందరూ చీఫ్ కోఆర్డినేటర్ సజ్జలకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు తనకు ఆమోదయోగ్యం కాలేదన్నారు. అందుకే తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేయలేక, నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని ముందే వదులుకుని పార్టీకి కూడా రాజీనామా చేశానని స్పష్టం చేశారు.

**వైసీపీలో నంబర్ 2 జగన్.. నాది కోవర్ట్ రాజకీయం కాదు**

"ఇప్పుడు వైసీపీలో నంబర్ 2 ఎవరంటే జగన్‌గారు. నంబర్ 1 ఎవరంటే 'సకల శాఖల మంత్రి' సజ్జల" అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ కొత్త నంబర్ వన్‌కు నమస్కారాలు, సాష్టాంగాలు పెడుతూ తాను సర్దుకుపోలేనని, అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. తాను జగన్‌కు ఎన్నడూ ద్రోహం చేయలేదని, చేయబోనని స్పష్టం చేశారు.

పార్టీని కబ్జా చేసి, జగన్‌ను మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం తనకు చేతకాదని, తాను ప్రజాస్వామ్యబద్ధంగా నేరుగా గెలిచేందుకే యుద్ధం చేస్తానని, అందుకే కొత్త పార్టీ పెడుతున్నానని ప్రకటించారు. పార్టీలో ఎవరు కోవర్టుగా పనిచేస్తున్నారో కార్యకర్తలు, అభిమానులు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు తెలియజేస్తానని తన లేఖను ముగించారు.

# ముఖ్యమంత్రిని పనిచేసుకోనివ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి ఉందని.. కానీ, కాంగ్రెస్ పాలనపై సాధారణ ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు. మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన కీలక విషయాలపై స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి కొత్త వాటిని అమలు చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్గంపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయ్యిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలన్నారు. అదేవిధంగా పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే నష్టం జరుగుతుందన్నారు. పార్టీలో లీకేజీలను కంట్రోల్ చేయాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన చెప్పుకొచ్చారు. మరోవైపు, నాలుగు పంటలకూ రైతు భరోసా అందించాలని శాసన మండలి ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏని రద్దు చేయాలని సూచించారు. ప్రజలకు ఉచిత పథకాలను తగ్గించాలని, నిజమైన లబ్దిదారులకే వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయొద్దని, వారికి న్యాయం చేయాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

## అంబాసిడర్‌గా కపిల్ దేవ్

## మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించు కుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక, క్రీడా రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా క్రీడలు, పర్యాటక రంగాలు రెండింటినీ మిళితం చేస్తూ తెలంగాణను 'గోల్ఫ్ టూరిజం హబ్'గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ శివారు ప్రాంతమైన షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో




దాదాపు 130 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ గోల్ఫ్ కోర్సును నిర్మించనున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే క్రీడాకారులను, పర్యాటకులను ఆకట్టుకునేలా దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన చేయనున్నారు. దీంతోపాటు, ప్రకృతి అందాలకు నిలయమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్ద మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ రెండింటిని నిర్మించి, పర్యాటకులకు ఉన్నత స్థాయి వసతులను కల్పించనున్నారు. భారీ ప్రాజెక్టులతో పాటు తెలంగాణ పర్యాటక , క్రీడారంగాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రముఖ భారతీయ క్రికెట్ దిగ్గజం, గోల్ఫ్ క్రీడాభిమాని కపిల్ దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనకున్న ప్రపంచవ్యాప్త గుర్తింపు ద్వారా విదేశీ పర్యాటకులను, పెట్టుబడిదారులను తెలంగాణ వైపు ఆకర్షించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం. ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి కేవలం పర్యాటక ఆదాయం మాత్రమే కాకుండా, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విదేశీ పర్యాటకుల రాకతో హోటల్, రవాణా రంగాలకు కూడా మహర్దశ పడుతుంది. ప్రకృతి సౌందర్యం, ఆధునిక క్రీడా వసతుల మేళవింపుతో తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.

# నూతన దంపతులకు నాయకుల ఆశీస్సులు



**కొణిజర్ల/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తీగలబంజర గ్రామంలో జరిగిన జిల్లెల్ల కవిత వివాహ వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొని నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. గతంలో తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన జిల్లెల్ల కవిత వివాహానికి గొల్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వార్డు సభ్యుడు ఇశ్నేపల్లి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం సభ్యుడు పసుమర్తి జనార్దన్‌రావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు వెంకట్, పంచాయతీ కార్యదర్శి తదితరులు నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# గుంత పూడ్చిన టీడీపీ నేతలు



**వైరా/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకులు ఆరోపించారు. పల్లిపాడుకొనిజర్ల గ్రామాల మధ్య రహదారిపై ఏర్పడిన భారీ గుంతను శనివారం వారు శ్రమదానంతో పూడ్చారు. గుంతల కారణంగా ఇటీవల పలువురు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలయ్యారని తెలిపారు. అధికారులు స్పందించి రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. టీడీపీ వైరా నియోజకవర్గ బాధ్యులు చెరుకూరి చలపతిరావు, మండల అధ్యక్షుడు కిలారు సురేందర్, కొనిజర్ల మండల నాయకుడు దామా శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు బొల్లెపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుడ్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పమ్మి అర్జున్‌రావు, ఏఎంసీ డైరెక్టర్ మోత్కూరి వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మందడం మధుసూదన్‌రావు, నాయకులు మద్దినేని రామారావు, బోడేపూడి మురళి, శ్యామసుందర్, చింతల శీను, ఎలమంచిలి భోగేశ్వరరావు, ఎలమద్ది శీను, పాటి నాగేశ్వరావు, ఉపేందర్, చిన్న తాతయ్య, కట్ట నరసింహారావు, తూనాటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ






**హసన్‌పర్తి/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం పరామర్శించారు. మసాని మరియా, ధమిషెట్టి రాజు, రౌతు వీరస్వామి నివాసాలకు వెళ్లిన ఎమ్మెల్యే.. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, ఎల్లవేళలా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే నాగరాజు భరోసా ఇచ్చారు. పాల్గొన్న నాయకులు.. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రి, గ్రామ సర్పంచ్ పద్మ యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఎర్రబెల్లి మధుకర్‌రావు, ఉపాధ్యక్షుడు శివరాత్రి సారంగపాణి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, వార్డు సభ్యులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి పౌరులు

## చదువులో రాణించాలి డాక్టర్ కాపా చంద్రకళ




**వైరా/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైరా మునిసిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ అన్నారు. శనివారం వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ మురళీకృష్ణ ఆస్పత్రిలో ఖమ్మంకు చెందిన నాలుగు, ఐదో తరగతి విద్యార్థినులు సముద్రాల తేజస్విని, అక్షితలకు రూ.5 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యలో రాణించాలని చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జీఎంటీ జిల్లా కోఆర్డినేటర్ ఉండు శ్యాంబాబు, జిల్లా కమిటీ సభ్యుడు చింతోజు నాగేశ్వరరావు, వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొల్లా రాంబాబు, కార్యదర్శి కొదమూరు రవి, లయన్స్ సభ్యులు తిరుపతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్‌లో అశ్వారావుపేటకు ప్రథమ స్థానం

## జాతీయ స్థాయికి ఆసుపాక క్రీడాకారులు.. ఎమ్మెల్యే జారె ఘన సన్మానం



**దమ్మపేట/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహించిన 18వ ఈషా గ్రామోత్సవం, గ్రామీణ క్రీడా ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలోని రూరల్ ప్రీమియర్ లీగ్2026లో అశ్వారావుపేట నియోజకవర్గ క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచారు.

ఈ సందర్భంగా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ జాతీయస్థాయికి ఎంపికైన ఆసుపాక గ్రామ క్రీడాకారులను అభినందించి ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి అశ్వారావుపేట నియోజకవర్గానికి మంచి పేరు తీసుకువచ్చినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం, అవకాశాలు లభిస్తే రాష్ట్ర, జాతీయస్థాయిలో మరింత ఉన్నతంగా రాణించగలరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లోనూ అశ్వారావుపేట నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. ఆసుపాక క్రీడాకారులు సాధించిన విజయం నియోజకవర్గంలోని ఇతర గ్రామాల యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# ఎఫ్ఎల్ఎన్‌తో గుణాత్మక విద్య అందించాలి

## విద్యార్థుల హాజరు పెంచేందుకు చర్యలు -12 పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధన





**హసన్‌పర్తి/ ఆగస్టు 29(జర్నలిస్ట్ వార్త)** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతోపాటు గుణాత్మక విద్య అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాస్ సూచించారు. హసన్‌పర్తి మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో మండలస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తరగతి గది బోధనకు ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా విద్యార్థులు నిర్దేశిత సామర్థ్యాలను 100 శాతం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఏఐ ఆధారిత విద్యాబోధనకు ఎంపికైన 12 పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠాలను సమర్థంగా బోధించాలని ఆదేశించారు.

**హాజరుపై ప్రత్యేక దృష్టి**

ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్)లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయానికి హాజరు నమోదు చేయాలని సూచించారు. ఓడీలో ఉన్నవారు ఓడీ, సెలవులో ఉన్నవారు లీవ్ నమోదు చేయాలని చెప్పారు. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదించి, వారు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

యూడైస్ ప్లస్‌లో నమోదుయూడైస్ ప్లస్‌లో పాఠశాలలోని విద్యార్థులందరి వివరాలను నమోదు చేయాలని ఎంఈఓ సూచించారు. డీఆర్‌ఓపీ బాక్స్‌లో ఉన్న విద్యార్థులు ఏ పాఠశాలలో ప్రవేశం పొందారో అక్కడే నమోదు చేయాలన్నారు. ప్రశస్త్ యాప్‌లో ఉపాధ్యాయులందరూ నమోదు చేసుకుని వీడియోలు వీక్షించాలని తెలిపారు. పాఠశాలల పరిశుభ్రత, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఆహార భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సంసిద్ధత పాఠాలను సమర్థంగా అమలు చేసి నాణ్యమైన విద్య అందించడంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, డి. రవికుమార్, ఆర్. రవీందర్, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# 16 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలపై నిషేధం

## సీఎం రేవంత్‌రెడ్డికి బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడి విజ్ఞప్తి



**హుజురాబాద్/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** 16 ఏళ్లలోపు బాలబాలికలు సామాజిక మాధ్యమాలను వినియోగించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్‌చంద్రబోస్ కోరారు. ఈ మేరకు శనివారం హుజురాబాద్‌లో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, బాలల హక్కుల పరిరక్షణ కోసం తమ సంస్థ గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తోందని తెలిపారు. సెప్టెంబరు నెలలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలనతోపాటు బాలల హక్కులపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించే సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**మొబైల్ వినియోగంపై పర్యవేక్షణ అవసరం**

స్మార్ట్‌ఫోన్లను సరైన పర్యవేక్షణ లేకుండా పిల్లలకు ఇవ్వడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని సుభాష్‌చంద్రబోస్ అన్నారు. అధికంగా మొబైల్ వినియోగించడం వల్ల పిల్లల్లో కంటి చూపు, ఏకాగ్రత లోపం, నిద్రలేమి, నిరుత్సాహం వంటి సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో హింసాత్మక కంటెంట్, అపరిచితులతో పరిచయాలు, సైబర్ వేధింపులు పిల్లల భద్రతకు ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కొంతమంది విద్యార్థులు చెడు సావాసాలకు లోనై మద్యం, సిగరెట్లు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని తెలిపారు. చదువును నిర్లక్ష్యం చేసి భవిష్యత్తును నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, పిల్లలను ప్రభావితం చేసే హానికర డిజిటల్ కంటెంట్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి**

పిల్లల చేతికి సెల్‌ఫోన్ ఇచ్చి వదిలేయకుండా తల్లిదండ్రులు వారి స్క్రీన్ సమయం, ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో మొబైల్ వినియోగాన్ని నియంత్రించడంతోపాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించాలని కోరారు.

పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 16 ఏళ్లలోపు బాలబాలికల సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణకు శాసనసభలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. పిల్లల భద్రత, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర కమిటీ తరపున విజ్ఞప్తి చేశారు.

# సాగర్ ఎడమ కాలువ నుంచి 6,000 క్యూసెక్కుల నీటి విడుదల

## చెరువులు, కుంటలు నింపి తాగు, సాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం

## చివరి ఆయకట్టు వరకు నీరందించాలి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** మిర్యాలగూడ నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. సాగర్ ఎడమ కాలువ నుంచి 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి, నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను నింపేందుకు చర్యలు ప్రారంభించారు.

పెద్దదేవులపల్లి వద్ద ఉన్న అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌ను ఎమ్మెల్యే స్వయంగా ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్ గేట్లను ఎత్తడంతో పాటు నియోజకవర్గ పరిధిలోని వజిరాబాద్ మేజర్, కిష్టాపురం మేజర్, మల్కల్ కాలువ మేజర్, తక్కెలపాడు లిఫ్ట్ గేట్ల ద్వారా కూడా నీటిని విడుదల చేసే ప్రక్రియను ప్రారంభించారు. చెరువులు, కుంటల్లోకి నీటిని మళ్లించడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుందని, తద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తగ్గడంతో పాటు రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతాంగానికి మేలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి నీటి వనరులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రైతుల పంటలకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను నీటితో నింపి భూగర్భ జలాలను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నీటి విడుదల సక్రమంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నీటి వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు.. మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలి




**సత్తుపల్లి/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల మిరాకిల్ మైండ్స్‌ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి, తెలుగు భాషకు వారు చేసిన సేవలను స్మరించుకున్నారు.విద్యార్థులు ప్రదర్శించిన వివిధ వేషధారణలు, ఒలింపిక్ రింగుల ఆవిష్కరణ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ పద్యపఠనం, వ్యాసరచన, చర్చా పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రత్నాకర్ మాట్లాడుతూ మాతృభాష మన ఆత్మవంటిదని, తెలుగు భాషతో పాటు క్రీడలను కూడా గౌరవించాలని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి



**హసన్‌పర్తి/ఆగస్టు 29 జర్నలిస్ట్ వార్త:** గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ కోరారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సైలు రవి, గోవర్ధన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసులతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద రాత్రివేళ నిర్వాహకులు కాపలాగా ఉండాలని, వీలైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ వైరింగ్‌లో జాగ్రత్తలు పాటించాలని, అనుమతిలేని విద్యుత్ కనెక్షన్లు వినియోగించవద్దని సూచించారు.
కోర్టు నిబంధనలకు అనుగుణంగా లౌడ్‌స్పీకర్లను వినియోగించాలని, అశ్లీల పాటలు, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు సూచించిన మార్గాల్లోనే ఊరేగింపు నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పీస్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి పల్లెలో ఇందిరమ్మ ఇళ్లు..
## అభివృద్ధి దిశగా గ్రామాలు





**ఎల్కతుర్తి/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**పల్లె పల్లెకు పొన్నం.. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శనివారం ఎల్కతుర్తి మండలంలోని సూరారం, దండేపల్లి, వీరనారాయణపూర్, వల్బాపూర్, ఇందిరానగర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు చేరుకున్న మంత్రికి సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికి స్థానిక సమస్యలను వివరించారు.వీరనారాయణపూర్ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రహదారుల నిర్మాణం తదితర అంశాల్లో గ్రామానికి ప్రాధాన్యం లభిస్తోందని తెలిపారు. దండేపల్లి సర్పంచ్ గోలీ సంపత్ గ్రామానికి, కాలనీలకు రహదారుల అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశామని, వాటిని ప్రజలు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. పేపర్ ప్లేట్ల వినియోగంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఇంటింటికీ చేరుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ కట్టిన ప్రతి అక్కాచెల్లెమ్మకు అండగా ఉంటా
### డాక్టర్ పిడమర్తి రవి



**సత్తుపల్లి/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** రక్షాబంధన్ సందర్భంగా కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల్లో పలువురు అక్కాచెల్లెమ్మలు తనకు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటుకున్నారని కాంగ్రెస్ నాయకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. రాఖీ ఆత్మీయత, నమ్మకం, బాధ్యతలకు ప్రతీక అన్నారు. తనకు రాఖీ కట్టిన ప్రతి మహిళను సొంత అక్కాచెల్లెమ్మగా భావించి వారి గౌరవం, భద్రత, హక్కుల పరిరక్షణకు జీవితాంతం అండగా ఉంటానని చెప్పారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో మహిళలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. రాఖీ కట్టిన ప్రతి అక్కాచెల్లెమ్మకు కృతజ్ఞతలు, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఫీజు బకాయిలు ఇచ్చేదాకా వదిలిపెట్టం.
### -బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి.



**బయ్యారం/ఆగస్టు 29(జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని బీజేపీ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.త్వరలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో 'ఫీజు బకాయి- బీజేపీ లడాయి' పేరుతో దీక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి కృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా శ్రీనివాస్,బయ్యారం మండలానికి చెందిన బీజేపీ పార్టీ జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాస్ రావు పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దాదాపు 4 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ఇబ్బందు ల్లో పడిందని నాయకులు ఆరోపించారు.ప్రస్తుతం 10 వేల కోట్ల నుంచి 12 వేల కోట్ల వరకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని,చదువులు పూర్తయినా సర్టిఫికెట్లు రాక విద్యార్థులు నష్టపోతున్నారని వారు అన్నారు.ఫీజు బకాయిలు చెల్లించకుంటే జిల్లాలో అన్ని మండలాల్లో వివిధ నిరసన కార్యక్రమాలు చెపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలే యువతకు బంగారు భవిష్యత్‌కు బాట
### జమ్మికుంటలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**జమ్మికుంట/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** క్రీడలు యువత జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పలువురు వక్తలు అన్నారు. జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు, భారతదేశం గర్వించదగిన క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం, ప్రజలు, క్రీడా సంఘాలు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి తగిన శిక్షణ, ప్రోత్సాహం కల్పించాలని కోరారు. క్రీడల్లో రాణించే యువతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో హాకీ జాతీయ క్రీడాకారులు, మాజీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, క్రీడాకారులు బండ సాయి, జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గండికోట సమ్మయ్య, డాక్టర్ అంబాల ప్రభాకర్, వంతడుపుల రఘు, బుర్ర కుమార్, తిరుపతి శ్రీనివాస్, కౌన్సిలర్ కొలుగూరి సురేష్, మంద రాజేష్, కంకణాల బిక్షపతి, దామెర శ్యామ్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, బీఎస్పీ సీనియర్ నాయకులు మారపల్లి మొగులయ్య, గంగారపు రాజయ్య, రాజపల్లి గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకురాలు లక్ష్మి, శనివారం భాస్కర్, శనిగరపు జైపాల్, పూలల ప్రశాంత్, పంజాల అరవింద్, మైస వంశీ, గూడెల్లి సాయి, పంజాల శ్రీరామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం.
### -మేజర్ ధ్యాన్ చంద్ కు ఘననివాళి.



**బయ్యారం/ఆగస్టు 29(జర్నలిస్ట్ వార్త);**
శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ కు నివాళులర్పిస్తూ విద్యార్థులు ఒలింపిక్ జ్యోతి పట్టుకొని పరిగెడుతున్న క్రీడాకారుడి ఆకృతిలో మానవహారంగా కూర్చుని అందరినీ ఆకట్టుకున్నారు. దాదాపు 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు.ఎన్ఎస్ డి(నేషనల్ స్పోర్ట్స్ డే) అనే అక్షరాల ఆకృతిని కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదార్,డీన్ విద్యాసాగర్,సి-బ్యాచ్ ఇంచార్జ్ మల్లేశం, పి.ఇ.టి లు యాకయ్య, రాకేష్,ప్రియాంక, ఉపాధ్యాయులు రామయ్య, కుమారస్వామి,రాజేష్, బద్రు,నరేష్, సయ్యద్ మీరా, రాంబాబు,సుధాకర్,రంజిత్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటమల్లు దశదినకర్మలో పాల్గొన్న రావు పద్మ



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో శ్రీరాముల విజయ్‌కుమార్ తండ్రి శ్రీరాముల వెంకటమల్లు దశదినకర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి రావు పద్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా వెంకటమల్లు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం శ్రీరాముల విజయ్‌కుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని రావు పద్మ అన్నారు.
కార్యక్రమంలో వారి వెంట బిజెపి సీనియర్ నాయకులు గంకిడి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వెంకటమల్లుకు నివాళులర్పించారు.

# తిమ్మాపూర్‌లో దళితుడిపై దాడి.. ఆటవిక చర్య

### నిందితులను వెంటనే అరెస్టు చేయాలి: డీహెచ్‌పీఎస్

**ఎల్కతుర్తి/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో దళితుడు కొలుగూరి రమేష్‌పై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు.
శనివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రమేష్‌పై దాడి ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదై ఎనిమిది రోజులు గడిచినా నిందితులను అరెస్టు చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం-1989 ప్రకారం ముప్పు మానస, ముప్పు మహేందర్, ముప్పు అభిరామ్‌లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచిని విధుల




నుంచి తొలగించాలని కోరారు.
నిందితులు బయట ఉండటంతో బాధితుడు రమేష్, ఆయన కుటుంబ సభ్యుల్లో భయాందోళన నెలకొందని అనిల్‌కుమార్ తెలిపారు. నిందితులు బాధితుడిని బెదిరించడం, సాక్షులను ప్రభావితం చేయడం లేదా దర్యాప్తును అడ్డుకునే పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్ర మంత్రిగా ఉన్న నియోజకవర్గంలోనే దళితుడిపై దాడి జరిగి ఎనిమిది రోజులు గడిచినా నిందితుల అరెస్టులో పోలీసు యంత్రాంగం ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. దళిత పక్షపాత ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దళితులకు రక్షణ లేకుండా పోతోందనే భావన ప్రజల్లో ఏర్పడుతోందని విమర్శించారు.నిందితుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ సర్పంచి ఉన్నందున రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వారిని కాపాడే ప్రయత్నం చేస్తే కాంగ్రెస్‌పై దళిత వ్యతిరేక పార్టీ అనే ముద్ర పడుతుందని హెచ్చరించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయకపోతే బాధితుడికి న్యాయం జరిగే వరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.
సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి శేనిగరపు రాజుకుమార్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్, నాయకులు చంద్రమౌళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పల్లెలో ఇందిరమ్మ ఇళ్లు

## అభివృద్ధి దిశగా గ్రామాలు

**ఎల్కతుర్తి/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజా పాలనలో భాగంగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. శనివారం ఎల్కతుర్తి మండలంలోని సూరారం, దండేపల్లి, వీరనారాయణపూర్, వల్బాపూర్, ఇందిరానగర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. మంత్రికి సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా గ్రామాల వారీగా సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వీరనారాయణపూర్ సర్పంచ్



పుల్లూరి శ్రీధర్‌రావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రహదారుల నిర్మాణంతో గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. దండేపల్లి సర్పంచ్ గోలీ సంపత్ గ్రామంతోపాటు కాలనీలకు రహదారులు నిర్మించాలని మంత్రిని కోరారు.


**పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి**

ప్రజా పాలనలో భాగంగా ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశామని, వాటిని వినియోగించి పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. పేపర్ ప్లేట్ల వినియోగం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదల ఇంటింటికీ చేరుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వ్యక్తి మృతి

## మృతదేహం గుర్తింపు.. హసన్‌పర్తి పోలీసుల కేసు నమోదు

**హసన్‌పర్తి/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**



అనారోగ్యం, మానసిక మనస్తాపంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హసన్‌పర్తి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. అర్వపల్లి గ్రామానికి చెందిన సైద్ జానీ (45) వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య మౌలాన్‌బీ ఉన్నారు.

సుమారు ఏడాది క్రితం జానీ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు క్షయ (టీబీ) వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. అప్పటి నుంచి అనారోగ్యంతో పనులకు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. వ్యాధి తీవ్రతతో పాటు కుటుంబ పరిస్థితులపై తీవ్ర మనస్తాపానికి గురైన జానీ మద్యానికి బానిసైనట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 27న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన జానీ రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించారు. మరుసటి రోజు (28న) సాయంత్రం సిద్ధాపురం సర్పంచ్ హరీష్ ఫోన్ చేసి కోమటికుంట బండల వద్ద ఓ గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతదేహం సైద్ జానీదిగా గుర్తించారు. తీవ్ర అనారోగ్యంతోనే తన భర్త మృతి చెందాడని, మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి భార్య మౌలాన్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

# తల్లాడలో ఘనంగా లిఖితారెడ్డి హోటల్ ప్రారంభం

## టిఫిన్స్.. కర్రీ పాయింట్.. నాన్‌వెజ్ వంటకాల ప్రత్యేకత




**తల్లాడ/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ పట్టణ ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన లిఖితారెడ్డి హోటల్, టిఫిన్స్, కర్రీ పాయింట్ ఆదివారం ఘనంగా ప్రారంభం కానుంది. హోటల్ యాజమాన్యం లిఖితారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ హోటల్‌లో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా పలు రకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచనున్నారు. ఉదయం నుంచి ఇడ్లీ, దోశ, ఉప్మా, వడ తదితర రుచికరమైన టిఫిన్ వంటకాలతో పాటు వివిధ రకాల నాన్‌వెజ్ వంటకాలు అందించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. అలాగే కర్రీ పాయింట్ ద్వారా ఇంటికి తీసుకెళ్లేందుకు పలు రకాల కూరలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

రుచి, నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని లిఖితారెడ్డి తెలిపారు. రుచి మా ప్రతిజ్ఞ మీ సంతృప్తి మా లక్ష్యం అనే నినాదంతో హోటల్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. తల్లాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు హోటల్‌ను సందర్శించి తమ ఆదరణ అందించాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని లిఖితారెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# కేశవరెడ్డి మృతి.. గ్రామంలో విషాదం

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడి సోదరుడికి నాయకులు, ప్రజాప్రతినిధుల ఘన నివాళి

**తల్లాడ/ ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**



మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి సోదరుడు దుండేటి కేశవరెడ్డి అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతితో గొల్లగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళికేశవరెడ్డి మృతి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో గొల్లగూడెంలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేశవరెడ్డి మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దీవెల కృష్ణయ్య, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, దిరిశాల నరసింహారావు, పగడాల లచ్చిరెడ్డి, కోదూరి వీరకృష్ణ, ధూపాటి భద్రరాజు, మారెళ్ల మల్లికార్జునరావు, తుమ్మలపల్లి రమేష్, తాళ్ల జోసఫ్, కోదూరి శ్రీనివాసరావు, పొట్టేటి జనార్ధన్‌రెడ్డి, తూము వెంకటనారాయణ, నున్న శ్రీను, సారకర్రెడ్డి తదితరులు పాల్గొని కేశవరెడ్డికి నివాళులర్పించారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

## సెప్టెంబరు 2 నుంచి 8 వరకు కార్యక్రమాలు

## ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలులో విఫలం -రవీంద్రకుమార్

**దేవరకొండ/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**



కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబరు 2 నుంచి 8 వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం దేవరకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 2న గ్యారెంటీల వైఫల్యంపై ధర్నాలు, 3న రైతు సదస్సులు, 4న మహిళా సదస్సులు, 5న విద్యార్థుల ర్యాలీలు, 7న ప్రజావాణిలో వినతిపత్రాల సమర్పణ, 8న విలేకరుల సమావేశాలు నిర్వహించనున్నట్లు రవీంద్రకుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేతావత్ బీల్యా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీసీల కోసం విద్యార్థుల ధర్నా

## విస్డం కళాశాల యాజమాన్యంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం -రాతపూర్వక హామీ.. ఇవ్వకపోతే రిలే నిరాహార దీక్షకు హెచ్చరిక

**జమ్మికుంట/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారంటూ జమ్మికుంట పట్టణంలోని విస్డం కళాశాల యాజమాన్యంపై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీలు) ఇవ్వకుండా రోజుల తరబడి తిప్పించుకుంటున్నారని ఆరోపిస్తూ శనివారం కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విస్డం కళాశాలను ఇతర ప్రాంతాలకు విక్రయించిన అనంతరం ద్వితీయ సంవత్సరం చదవాల్సిన విద్యార్థులకు టీసీలు అవసరమయ్యాయని, వాటి కోసం కళాశాల యాజమాన్యాన్ని సంప్రదిస్తున్నా సరైన సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. టీసీల కోసం విద్యార్థులు పలుమార్లు కళాశాల చుట్టూ తిరగాల్సి రావడంతో వారి తదుపరి విద్యకు ఆటంకం



ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని నాయకులు విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై ప్రభుత్వం, విద్యాశాఖ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

**పోలీసుల జోక్యంతో..:** ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కళాశాల యాజమాన్యంతో చర్చించారు. విద్యార్థులకు టీసీలు అందజేయాలని సూచించారు. దీంతో ఆదివారం ఉదయం 10 గంటల తర్వాత టీసీలు అందజేస్తామని కళాశాల యాజమాన్యం లెటర్‌ప్యాడ్‌పై రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. దీంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.

**ఇవ్వకపోతే.. దీక్ష:** యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు ఆదివారం టీసీలు అందజేయకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపడతామని నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో గట్టు సాయిరాం, జవ్వాజి అనిల్, నలఘశ హరీష్‌యాదవ్, నరెంగుల శివ, సాయి, రాజు, కౌశిక్, వినయ్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల కోసం గోదాములు నిర్మిస్తాం

## 15 రోజుల్లో భూముల సర్వే.. లేఅవుట్ మ్యాప్ సిద్ధం చేయాలి -అధికారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశం

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 29(జర్నలిస్ట్ వార్త):**

రైతుల అవసరాలకు అనుగుణంగా గోదాములు నిర్మించి మార్కెట్ స్థలాలను సద్వినియోగం చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. ధర్మసాగర్ మండలం ముప్పారం, వేలేరు మండలం సోడాషపల్లిలో వరంగల్ ఏనుమాముల మార్కెట్ ఆధీనంలోని స్థలాలను మార్కెట్ చైర్మన్ ఎర్ర ప్రియాంక అనిల్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు.

ముప్పారం పరిధిలో మార్కెట్‌కు ఉన్న మొత్తం భూమి ఎంత? మోడల్ స్కూల్, ప్రస్తుతం నిర్మిస్తున్న గోదాముకు ఎంత స్థలం కేటాయించారు? ఇంకా ఎంత భూమి అందుబాటులో ఉంది? అనే వివరాలతో సమగ్ర సర్వే నిర్వహించాలని కడియం శ్రీహరి సూచించారు. భూమి సరిహద్దులను గుర్తించి 15 రోజుల్లో పూర్తి స్థాయి లేఅవుట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న భూమిని రైతుల ప్రయోజనాల కోసం వినియోగంలోకి తీసుకొచ్చేలా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.



**రూ.2 కోట్ల సబ్‌యార్డు ఎందుకు నిరుపయోగం?**

సోడాషపల్లి గ్రామ పరిధిలోని ఐదు ఎకరాల మార్కెట్ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. రూ. 2 కోట్లతో నిర్మించిన సబ్‌యార్డు ఎందుకు నిరుపయోగంగా ఉందని మార్కెట్ అధికారులను ప్రశ్నించారు. వెంటనే వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు జంగిల్ క్లియరెన్స్, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులకు ఉపయోగపడేలా సబ్‌యార్డును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.



ఐదు ఎకరాల స్థలానికి పూర్తి స్థాయి లేఅవుట్ మ్యాప్ రూపొందించి, 5 వేల నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్‌యార్డు వినియోగంలోకి రావడంతో పాటు గోదాం నిర్మాణం జరిగితే వేలేరు మండల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుమాముల మార్కెట్ చైర్మన్ ఎర్ర ప్రియాంక అనిల్, వైస్ చైర్మన్ బండి జనార్దన్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# వృద్ధుల ఆరోగ్యానికి అండగా..

# ఉచిత మెగా వైద్య శిబిరం

## పాత ముగ్దంపురంలో వైద్యుల సేవలు.. 100 దంత సంరక్షణ పేస్టుల పంపిణీ -డాక్టర్ ఎం. భరత్‌రెడ్డి






**నర్సంపేట/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** పాత ముగ్దంపురం గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన శిబిరంలో నర్సంపేటవరంగల్‌కు చెందిన వైద్య నిపుణులు పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు, అవగాహన కల్పించారు.

**దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.**

**డాక్టర్ భరత్‌రెడ్డి**

ఈ సందర్భంగా దంత వైద్య నిపుణుడు డాక్టర్ ఎం. భరత్‌రెడ్డి మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో దంత సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆహారం తీసుకోవడంలో ఇబ్బందులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సున్నితత్వం, నొప్పి, చిగుళ్ల సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వృద్ధులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు 100 దంత సున్నితత్వ నివారణ పేస్టులను పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ, వేములపల్లి మొగిలి మెమోరియల్ ఫౌండేషన్, పాత ముగ్దంపురం గ్రామపంచాయతీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

సాధారణ వైద్యం, స్త్రీల వైద్యం, దంత, కంటి, చిన్నారుల వైద్య విభాగాల్లో సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశామన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ కవాటి విజయ్, డాక్టర్ విజయచంద్ర, డాక్టర్ డి. రామచందర్, డాక్టర్ ఎం. నవత, డాక్టర్ సింధూరి, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.









# లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

**కార్మికులంతా ఐక్యంగా పోరాడాలి జలగం బిక్షపతి**



**వర్ధన్నపేట/ఆగస్టు 29(జర్నలిస్ట్ వార్త);** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా హమాలీ యూనియన్ అధ్యక్షుడు జలగం బిక్షపతి డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో సెప్టెంబరు 4, 5, 6 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ నాలుగో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం వర్ధన్నపేట హమాలీలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ, శ్రమదోపిడీ, పని గంటల పెంపు, కార్మిక హక్కుల అణచివేతకు వ్యతిరేకంగా సకల రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపల్లి మునీశ్వర్ మాట్లాడుతూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి రవి, ఎలుమగంటి వేణు, శ్రీనివాస్, రవి, మోహన్‌బాబు, భుజంగం, యు.శీను, బి.ప్రకాష్, ఐత రాజు, వెంకన్న, బాబు, సుమన్, సంపత్, శ్రీకాంత్, కే.కుమార్, స్వీపర్ సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# 11వ వార్డుకు నిధులెప్పుడో..?

**అభివృద్ధి కోసం ఎదురుచూపులు..**

**ఎమ్మెల్యే, అధికారులు స్పందించాలి**

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా మౌలిక వసతులు కల్పించాలి :వార్డు మెంబర్ కళ్యాణి**





**ఐనవోలు/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** 60 ఓట్ల మెజార్టీతో ప్రజలు గెలిపించిన 11వ వార్డులో అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వార్డులో కనీస మౌలిక వసతులైన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ స్తంభాలు, రోడ్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉందని వార్డు మెంబర్ నల్లబెట్ట కళ్యాణి చిన్న రాజు యాదవ్ తెలిపారు.

అభివృద్ధి పనుల కోసం గ్రామపంచాయతీ స్థాయిలో పలుమార్లు తీర్మానాలు చేసినప్పటికీ నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉన్నా నిధులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే చొరవ చూపాలి...**

వార్డులోని సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేలా చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు కూడా వార్డులోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలు నమ్మకంతో గెలిపించారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. నిధులు సమకూరిన వెంటనే వార్డులోని మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తాం" అని కళ్యాణి తెలిపారు.

ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి వచ్చిన నేపథ్యంలో.ఎమ్మెల్యే, పంచాయతీ అధికారులు స్పందించి 11వ వార్డుకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారా? అనేది వేచి చూడాలి

# రోడ్డే పార్కింగ్..
# ప్రమాదానికి రెడ్‌కార్పెట్!

**బస్టాండ్ వద్ద అడ్డగోలు బైకులు.. అస్తవ్యస్తంగా ట్రాఫిక్**

**ప్రమాదకర మలుపులోనూ ఇదే తీరు.. అధికారులు మేల్కొనేదెప్పుడు?**









**వర్ధన్నపేట/ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రోడ్డునే పార్కింగ్ స్థలంగా మార్చేయడంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట, బస్టాండ్ మూల వద్ద ఉన్న ప్రమాదకర మలుపులో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తుండటంతో ప్రయాణికులు, బస్సులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బ్యాంకు, ఆర్థిక సంస్థ కార్యాలయం, హోటల్, మద్యం దుకాణం, ఇతర వ్యాపార దుకాణాలతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో రహదారి ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొంటున్నారు. ప్రమాదకర మలుపులో వాహనాలు నిలిపివేయడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భవనంలో సెల్లార్ ఉన్నప్పటికీ వాహనాల పార్కింగ్‌కు వినియోగించకుండా ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. దీంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయాల్సి వస్తోందని చెబుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు వెళ్లాల్సి వస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

రోడ్డుపై అడ్డగోలు పార్కింగ్‌ను నియంత్రించాల్సిన పోలీసు శాఖ, పార్కింగ్, రహదారి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ శాఖ, రహదారి భద్రతపై దృష్టి పెట్టాల్సిన రోడ్లుభవనాల శాఖ, ప్రజా రవాణా సమస్యలను పరిశీలించాల్సిన రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందే మేల్కొనడం మంచిదికాదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్డుపై పార్కింగ్‌ను నియంత్రించడంతోపాటు ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

**వడ్డీలకే సంపాదన అంతా ఖర్చు చేస్తున్నాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**సూర్యాపేటఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగడంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అంటూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఎంతో యాతన పడుతున్నామని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఇద్దరిని బలిగొన్న వేపచెట్టు వివాదం

**గొడ్డళ్లతో నరుకున్న ఇరువర్గాలు**

**అడ్డుకోబోయిన ఎస్ఐకి తీవ్ర గాయాలు**

**సూర్యాపేట,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**

సూర్యాపేటజిల్లాలో ఓ చిన్న వివాదం పెద్దదిగా మారి ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్నది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య చిచ్చు రేగింది. దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో ఒకరిపై ఒకరు వేసుకున్న గొడ్డలి వేట్లకు ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతోపాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తెలంగాణ చెరువుల పునరుద్దరణ అత్యావశ్యకం

**చిన్ననీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలి -సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక**



**హైదరాబాద్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణలో చెరువుల పరిరక్షణ, చిన్న నీటిపారుదల వ్యవస్థ బలోపేతం దిశగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కీలక సూచనలు చేసింది. చిన్న నీటిపారుదల వ్యవస్థను ప్రత్యేకంగా పునరుద్ధరించడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను సమన్వయం చేస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థను తీసుకురావాలని సిఫారసు చేసింది. చిన్న నీటిపారుదలపై రూపొందించిన నివేదికను కమిషన్ ప్రతినిధి బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించింది. ఈ సందర్భంగా రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ రంగ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని సూచించింది. చెరువుల పూర్తి నీటి నిల్వ మట్టం సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి శాశ్వతంగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నీటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, చిన్న చెరువులు, ఇతర చిన్న నీటి వనరులను పెద్ద నీటిపారుదల వ్యవస్థలతో అనుసంధానించే విధానాన్ని రూపొందించాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ బృందం ముఖ్యమంత్రికి వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో వ్యవసాయ రంగంలో పంటల మార్పిడిపై మరింత దృష్టి పెట్టాలని, ఉద్యానవన పంటల సాగును పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపైనా కమిషన్ ప్రత్యేకంగా పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. చెరువుల పునరుద్ధరణతో పాటు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే అంశాలపై కూడా కమిషన్ మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు.

# నేడు నీట్ పిజి ఎంట్రెన్స్ టెస్ట్

**పటిష్ట ఏర్పాట్లు చేసిన వరంగల్ పోలీసులు**

**వరంగల్,ఆగస్టు 29 (జర్నలిస్ట్ వార్త):**రంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరగనున్న నీట్ పీజీ–2026 పరీక్షల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా చేరరాదని ఆమె సూచించారు. ఈ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మైకులు, డీజేలతో ఊరేగింపులకూ అనుమతి ఉండదన్నారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ దుకాణాలు, స్టేషనరీ షాపులను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిఘాను మరింత పెంచామని, అవసరమైన సమాచారం సేకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన

చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షల సజావు నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కమిషనర్ ఎన్. శ్వేత విజ్ఞప్తి చేశారు.

---------------